# ప్రశ్నలు & సమాధానాలు

## ప్రశ్న 353, అహంకారం, మాయలను తొలగించడం ఎలా?

**మార్చి 27, 2025**

ఈ ఉద్ధరణ ప్రొ. అనిల్ కుమార్ గారి *Seeking Within,* పేజీలు *137-142* నుండి తీసికొనబడినవి.

ప్రొ. అనిల్ కుమార్ గారు భగవాన్ బాబా వారి సందేశము, ఉపదేశములను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పడానికి ఎంపిక చేయబడ్డారు. భారత దేశంలోను, ఇతర దేశాలలోను కూడా విస్తారముగా తిరిగి ఎంతో మంది భక్తులు అడిగిన ప్రశ్నలు, సందేహాలు స్వామి చెప్పిన వాక్కులు, ఉపన్యాసాలను మూలంగా తీసుకొని తేటతెల్లం చేసారు. ముఖ్యంగా ప్రొ. అనిల్ కుమార్ గారు మన సర్వాంతర్యామి సాయిని ఎలా చేరుకోవాలో మార్గం చూపుతారు.

ప్ర: అహంకారానికి మాయకి తేడా ఏమిటి? అవి రెండూ ఒకటేనా? వాటి రెండిటినీ తొలగించడం ఎలా?

జ: ప్రొ. అనిల్ కుమార్: మంచి ప్రశ్నలు! అహంకారానికి మాయకి ఏమైనా సంబంధం ఉందా? నా శ్రోతలు నాకంటే ఎక్కువ తెలిసిన వారని నేనెప్పుడూ అనుకుంటూ ఉంటాను. ఇది నేను అనుకోవడమే కాదు, నా నమ్మకం, అనుభవం కూడా. ఎంత మంచి ప్రశ్న!

అహంకారం, మాయ వేరు కాదు. ఒకటి ఇంకొక దానికి దారి తీస్తుంది. అహంకారం మొదటి అడుగు. అది రెండవ అడుగుకి దారి తీస్తుంది. దానినే మనం మాయ అంటాం, అనగా భ్రమ.

ముందు అహంకారం గురించి తెలుసుకుందాం. మొదట, మన అందరిలో అహంకారం ఉంటుందని గుర్తించాలి. చాలా మంది అహంకారులకి వారిలో అహంకారం ఉందని తెలియదు. అహంకారిని చూచినప్పుడు మనకు తెలుస్తుంది కాని అతనికి తెలియదు. కనుక, ముందు మనలో అహంకారం ఉందా అని తెలుసుకోవాలి.

అహంకారం అనగా దేహం, మనసు, బుద్ధిపై అభిమానం. అనగా నాలో ఉన్న చైతన్యానికి కలిగే దేహాభిమానమే అహంకారం. నాలో ఉన్న చైతన్యానికి మనసుపై కలిగే అభిమానమే అహంకారం. కనుక అహంకారం అనగా దేహం, మనసు, బుద్ధి అనే మూడింటిపై కలిగే అభిమానం. కానీ మనలో ఉన్న చైతన్యానికి ఈ మూడింటిపై అభిమానం లేకున్న అహంకారం లేనట్లే. ఆత్మ ఈ మూడింటికీ సాక్షి. ఆ స్థితి పొందడం సాధ్యమా? సాధ్యమే!

నేను ఈ దేహాన్ని అనుకుంటే నా కర్మలు, నా భావాలు ఒక రకంగా ఉంటాయి. నా దేహం భగవంతుని పనిముట్టు అనుకుంటే నా కర్మలు, నా భావాలు వేరే రకంగా ఉంటాయి. కనుక అహంకారం లేకుంటే దేహం పనిముట్టుగా భావించడానికి తోడ్పడ్తుంది, కానీ అహంకారం ఉంటే దేహాభిమానం కలుగుతుంది, అదే మాయకి దారి తీస్తుంది. కనుక, భౌతిక రూపంలో దేహాన్ని పనిముట్టుగా భావిస్తే నిరహంకారి అవ్వొచ్చు.

మానసికంగా కూడా నిరహంకారి అవ్వొచ్చు. ఎలా? మనసుని ఇలా పరీక్షించుకోవచ్చు: “నా మనసు ఇలా ఆలోచిస్తుంది. నా మనసుకి ఈ తలంపు కలిగింది. నా మనసు అల్లకల్లోలంగా ఉంది. నా మనసు కలవరపడుతుంది.”

ఇలా నా మనసుని పరీక్షించి చూసినప్పుడు నేను, నా మనసు వేరు వేరని చూడవచ్చు. నాకు నా తలంపులు తెలుసు కనుక నేను, నా తలంపులు వేరు వేరు. వాటికి నేను సాక్షి. నా మనసుకి, తలపులకి సాక్షి అయినప్పుడు నేను నిరహంకారి అవుతాను.

కానీ నా మనసుపై అభిమానం ఉంటే నా తలపులు వేరుగా ఉంటాయి. అందరూ మనతో అంగీకరించాలి అనుకుంటాం. అది విషాదకరమైనది. నువ్వు నాతో అంగీకరించాలని ఎందుకు అనుకుంటావు? నీవు కూడా నేను నీతో అంగీకరించాలి అనుకుంటావు. నేను నీ తోలుబొమ్మను కాదు. నువ్వే నేను పాడిన పాటకి ఆడు.

నేనెంత స్వతంత్రుడనో నువ్వూ అంతే. నాకెంత స్వేచ్ఛ ఉందో నీకూ అంతే అని గుర్తించాలి కానీ అహంకారి ఎన్నటికీ గుర్తించడు. నువ్వు ఒప్పుకొనేంత వరకూ సుత్తి కొడుతూనే ఉంటాడు. ఇంకా సమయం వృథా కాకుండా మనమే "సరే, నువ్వే కరెక్టు," అని అంటాం.

అటువంటి వాడిని దూరంగా పెట్టండి. కొందరితో వాదించడం వృధా ప్రయాస. వారితో ఉన్నప్పుడు మీ మానసికావస్థ చెడితే అహంకారం ఉన్నట్లు లెక్క. మన మానసికావస్థ ఆనందంగా నవ్వుతూ ఉండాలి. మిమ్మల్ని బాధపెట్టి నిస్సహాయుణ్ణి చేసే పరిస్థితి ఎదుర్కొంటే అక్కడ అహంకారం ఉన్నట్లు లెక్క.

మిత్రులారా, విపరీతాలు అన్నీ అహంకారమే. నేను స్వర్గంలో ఉన్నాను అంటే అది అహంకారం. నేను ఉరి వేసుకొని చచ్చిపోతాను అంటే అది అహంకారం. రెండు విపరీతాలూ అహంకారమే. మధ్యలో సమంగా ఉంటే అది నిరహంకారం.

"నేను తెలివైనవాడిని" అని మీరు నాతో అనవచ్చు.

"మీకెలా తెలుసు?" అని నేనడుగుతాను.

"మా గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలన్నీ చదివేసాను కదా?" అంటారు మీరు.

ఊరికే చదివినంత మాత్రాన మీరు తెలివైనవారు అవుతారా? లేదు! మీతో ఎవరైనా "నేను తెలివైనవాడిని" అని చెప్తే అంతే సంగతి! తెలివి అనేది ఒక అర్హత కాదు. అది కనపడే భావము, తీరు. కనుక మీరు తెలివైన వారు అని చెప్పుకుంటే అది 100% అహంకారం!

నాకు తెలిసింది ఒక్కటే - బుద్ధి అనేది భగవంతుని ప్రతిబింబం కనబడే అద్దం లాంటిది. దేహంలో, మనసులో భగవంతుని ప్రతిబింబం కనబడదు. బుద్ధి అనేది పరిశుద్ధమైన అద్దం. అది భగవంతుని ప్రతిబింబం చూపిస్తుంది. నిరహంకారం.

మిత్రులారా, అహంకారం, నిరహంకారం స్పష్టంగా తెలియజేశానని ఆశిస్తున్నాను. అహంకారం ఉంటే మాయకు దారి తీస్తుంది. కనుక నిరహంకారమే మాయకు మందు. అహంకారం లేకుంటే మాయ కూడా ఉండదు. ఒక చిన్న ఉదాహరణ తీసుకుందాం. ఇప్పుడు చీకటిగా ఉంది. కానీ వెలుగు ఉంటే చీకటి ఉండదు. అనగా వెలుగు ఉంటే చీకటి లేదని అర్థం. నేను లైటు వేసినప్పుడు "ఓ చీకటీ, ఈ గది విడిచి వెళ్ళిపో," అని అననక్కరలేదు. వెలుగు ఉంటే చీకటి ఉండదు, అంతే.

రెండవది, అహంకారం, మాయ రెండిటి నుండి బయటపడడం ఎలా? మీకు మళ్ళీ ప్రశ్నలు రాకుండా స్పష్టంగా చెప్తాను. "ఈ అహంకారం ఎక్కడినుండి వచ్చింది?" అని పరిశీలిద్దాం. అది "నేను" అనే మమత్వం నుండి ఆవిర్భవించింది. "నేను ఫలానా." ఈ 'నేను' అనేది అహంకారం. అది ఆది నుండి పూర్ణత్వం నుండి వచ్చినది. 'నేను' అనేది ఆత్మ నుండి వచ్చింది. ఆత్మయే ఈ 'నేను'కి పుట్టుకనిచ్చింది. దేహాభిమానం కలిగిన వెంటనే 50% అహంకారం పొందినట్లే. తరువాత మనసుపై అభిమానం కలిగితే మిగతా 50% అహంకారం కూడా వచ్చినట్లే, అంటే మహామాయ చేరినట్లే. కనుక ఈ 'నేను' అనే అహంకారం ఎక్కడ నుండి ఆవిర్భవించినదో కనుక్కోవాలి.

నీటి బుడగ నీటిలో మునిగిన వెంటనే ఇక నీటి బుడగ ఉండదు. అదే విధంగా ఈ 'నేను' అనేది ఆత్మలో లీనమవగానే ఇక అహంకారం ఉండదు. కనుక ఆత్మలో లీనమవడం ఎలా? అది మరో ప్రశ్న.

ఒక స్థాయిలో భజనలు పాడడం. భజనలు పాడినప్పుడు ఎవరూ అహంకారంతో పాడలేరు. అహంకారంతో పాడితే దానిని భజన అనలేము. సంగీత కచేరీలు భజనలు కాదు. అవి ప్రజల కొరకు ఇచ్చే ప్రదర్శనలు. భజన అనేది ఆత్మ కొరకు. కనుక భజనలో మమత్వం, అహంకారం ఉండవు. ఆత్మలో లీనమవ్వడానికి అది ఒక మార్గం.

రెండవ స్థాయి - ఇది పై స్థాయి - ధ్యానం. ధ్యానంలో నేను అనే మమత్వం పోతుంది. ధ్యానంలో 'నేను' అనేది పోయిందని ఎలా తెలుస్తుంది? ధ్యానంలో 'నేను' అనేదాని చలనం కనబడదు. ఎవరైనా "నా ధ్యానంలో ఇది పొందాను, అది సాధించాను" అంటే అతను అహంకారంపై ధ్యానం చేసాడు. నిజమైన ధ్యానంలో ఫలితాలు పొందడానికి ఎవరూ ఉండరు. ఒక చిన్న ఉదాహరణ: ఇక్కడ ఒక గ్లాసులో మంచినీరు ఉంది. దీనిలో కొంచెం చక్కెర కలిపాను. ఇప్పుడు ఆ చక్కెర ఎక్కడుంది? చక్కెర మొత్తం నీటిలో కరిగిపోయింది. కనుక, ధ్యానం చివరిలో 'నేను' అనేది పూర్తిగా ఆత్మలో కలిసిపోతుంది. అదే దానికి పరీక్ష.

ప్రొ. అనిల్ కుమార్ గారు వచ్చే వారం మరింత స్ఫూర్తిని ఇస్తారు. ధన్యవాదములు.

ఓం సాయి రామ్